

ఎదులాపురం : భారత సైన్యానికి మద్దతు తెలుపుతున్న న్యాయవాదులు



ఉట్నూర్ : జవాన్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ , నాయకులు

# సైనికా విజయీభవ

## ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న జవాన్‌లకు ఆశీర్వచనాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. హోమాలు
- మందమర్రిలో సంబురాలు.. మోదీ చిత్రపటానికి పాలాభిషేకం
- జై భారత్.. జై జవాన్ అంటూ నినాదాలు
- ఆదిలాబాద్‌లో న్యాయవాదుల ర్యాలీ
- అమరుడైన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు నివాళి





ఎదులాపురం, మే 9 : పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ సిందూర్‌పై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు సంబురాలు నిర్వహిస్తున్నారు. సైన్యం పనితీరు, పరాక్రమాలపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక భారత సైన్యానికి మద్దతుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అభిషేకాలు, అర్చనలు చేయిస్తున్నారు. 'సైనికా.. విజయోస్తు..' అంటూ ఆశీర్వచనాలు అందిస్తున్నారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించాలని కాంక్షిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని అతి పురాతనమైన మార్వాడీ ధర్మశాల వేంకటేశ్వరా స్వామి ఆలయంలో పూజలు చేశా రు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి విజయం సాధించినందుకు ఆలయ ప్రధాన అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ పట్టణంలో న్యాయవాదులు ర్యాలీ తీశారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలతో హోరెత్తించారు. జిల్లా కోర్టు నుంచి కలెక్టర్ చౌక్ మీదుగా ర్యాలీ తీశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకరంగా సరిహద్దులోని అమాయక ప్రజలపై పాక్ దాడులు చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్ష్మణచాంద, మే 9 : మండల కేంద్రంలోని శుక్రవారం అమ్మవారికి లక్ష్మణచాంద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్, మే 9 : జైనథ్‌లోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ రుకేశ్ రెడ్డి, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, జైనథ్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు గడ్డం జగదీశ్ రెడ్డి, రాజన్న, గంగారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి : జవాన్ మృతికి సంతాపంగా బీక్కుతండాలో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న గ్రామస్తులు

### మురళీనాయక్‌కు నివాళి

భైంసా, మే, 9 : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడి అమరుడైన ఆర్మీ జవాన్ ఎం. మురళీ నాయక్‌కు హనుమాన్ దీక్షాపరులు సంతాపం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కిసాన్ గల్లీలో రోకడేశ్వర హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని అంజన్నను వేడుకున్నారు. జవాన్ కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని ప్రత్యేక పూజలు చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌పై చేస్తున్న యుద్ధంలో భారత జవాన్లు విజయం సాధించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి కోర్వ చిన్నన్న, స్వాములు కోర్వ శ్రీకాంత్, సంతోష్, నిఖిలి భోజన్న, దత్తాద్రి, కారిగిరి రాజు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్, మే 9 : వీర జవాన్ మురళీనాయక్ మృతికి సంతాపకంగా స్థానిక వినాయక్ చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు గ్రామస్తులు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ తీసి నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ రాథో డ్ జనార్దన్, నాయకులు రితేశ్ రాథోడ్, జగన్, రమేశ్, వెంకటేశ్ నాయకులు ఉన్నారు.

ఇంద్రవెల్లి, మే 9 : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమరుడైన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ మృతికి సంతాపంగా ఇంద్రవెల్లి మండలంలోని బీక్కుతండాలో కొవ్వొత్తులతో గ్రామస్తులు ర్యాలీ తీశారు. ఆర్మీ జవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరశురామ్‌నాయక్ ఆడే రామేశ్వర్, రాథోడ్ రాంనివాస్, నూర్‌సింగ్, రాథోడ్ ఈశ్వర్, సురేశ్, సీతారాం, సకారాం, అరుణ్, చరణ్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి, మే 9 : హైదరాబాద్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

బెల్లంపల్లి, మే 9 : మండలంలోని బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయంలో చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి-శ్రీరాములు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. యుద్ధంలో ఆర్మీ జవాన్లు, దేశ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదని దేవున్ని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు వారు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, నాయకులు గోవర్ధన్, శ్రావణ్‌కుమార్, వెంకటస్వామి, ఆలయ ఈవో బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్, మే 9 : జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఒజ్జల నరేశ్ శర్మ, శిరీశ్‌శర్మ అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ పాకిస్తాన్‌పై విరోచిత పారోటానికి దిగిన సైనికులకు రాజకీయాలకు అతీతంగా అండగా ఉండాల్సిన అవసరముందన్నారు. భారత్ మాతాకీ జై.. అం టూ నినాదాలు చేశారు. వైరాగడే మనో జ్, సుగుణాకర్, కాంద్రె విశాల్, గంధం శ్రీనివాస్, రవికుమార్ జోషి, శంకర్రావ్, సురేశ్ చారి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



జైనథ్‌లో లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



భైంసాలో ఆర్మీ జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హనుమాన్ దీక్షాపరులు



లక్ష్మణచాందలో అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

# అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
- నూతన ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు శిక్షణ

ఎదులాపురం, మే 10: కేసుల దర్యాప్తులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేరస్తులను పట్టుకోవడంలో నైపుణ్యం సాధించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సెంట్రల్ డిటెక్టివ్ ద్వారా ఆదిలాబాద్‌లోని నూతన ఎస్ఐలు, నూతన పోలీసు సిబ్బందికి నేరస్తులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కనుగొనడంలో రెండు రోజుల పాటు శిక్షణను అందించారు. ఈ శిక్షణ వినియోగించుకొని నేరస్తుల కచ్చితమైన లొకేషన్ ప్రదేశాలను గుర్తించడం, నేరాలను కనుగొనడం, నేరాల దర్యాప్తు, టవర్ డంప్, కాల్ డేటా ఎనాలసిస్, లొకేషన్ లాంటివి పరిజ్ఞానాల్లో సైబర్ నేరస్తులు వినియోగిస్తున్న పద్ధతులు వాటిని ఛేదించే విధానాలను సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగాఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగించే ఆపరేటింగ్ సిస్టం, ఐపీ అడ్రస్, లొకేషన్, లాంటివి కనుగొనే పద్ధతులను వివరించారు. నెట్‌వర్క్ ప్రొవైడర్లతో మాట్లాడి కావాల్సినటువంటి సమాచారాన్ని తీసుకునే విధానం, ఉపయోగించాల్సిన యాప్‌ల పనితీరుపై వివరించారు. అదే విధంగా న్యాయస్థానంలో నేరస్తులకు శిక్షలు పడేందుకు పంచనామా రాసే విధానం, మహిళల మిస్సింగ్ కేసులు, సోషల్ మీడియా నందు జరిగే సైబర్ క్రైమ్ ఫ్రాడ్ కేసుల్లో విచారణ చేసే పద్ధతులపై పూర్తి పరిజ్ఞానాన్ని సంపాదించి నిష్ణాతులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ డీ సాయినాథ్, రూరల్ సీఐ కే ఫణిందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటి, అఖిలేశ్‌రావు, సైబర్ ఎక్స్‌పర్ట్, శ్రీధర్ డిజిటల్ ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్, మహేందర్ రెడ్డి సీడీఆర్, ఐపీడీఆర్ ఎక్స్‌పర్ట్ హైదరాబాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో నూతన ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



పట్టుకున్న జొన్నలతో పోలీసులు

# మహారాష్ట్ర జొన్నలు తెలంగాణకు..

- అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టివేత
- తరలించిన ఐదుగురితో పాటు పాస్‌బుక్కులు ఇచ్చిన ముగ్గురిపై కేసులు

తాంసి(భీంపూర్), మే 9 : తెలంగాణలో మార్కెట్లలో విక్రయించేందుకు మహారాష్ట్ర నుంచి జొన్నలను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు జైనథ్ సీఐ డీ.సాయినాథ్ తెలిపారు. తెలంగాణ మార్కెట్‌లో జొన్నలకు అధిక ధర లభిస్తుందని, మహారాష్ట్ర నుంచి జొన్నలను అక్రమంగా తరలించి ఆదిలాబాద్ జిల్లా విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జైనథ్ సీఐ డీ.సాయినాథ్ భీంపూర్ పోలీస్ సిబ్బంది కలిసి తనిఖీ చేశారు. శుక్రవారం నిపాని వద్ద మహారాష్ట్ర నుంచి జొన్నలతో వస్తున్న ట్రాక్టర్, 2 బొలెరో వాహనాలను పట్టుకున్నారు. మహారాష్ట్ర గటాన్జీ తాలూకా, వాగార్ తాంసి, జరూర్‌ల నుంచి జొన్నలు తీసుకొని తాంసి మార్కెట్ యార్డ్‌లో అధిక ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీటిని తరలించిన సుశాంత్ ముద్దెలవర్, దినేశ్ ముద్దెలవర్, రాథోడ్ సునీల్, పోవర్ భారత్, జాదవ్ గోకుల్‌తో పాటు ఇక్కడ విక్రయించేందుకు పట్టా పాస్ బుక్కులు ఇచ్చి సహకరించిన ఆనంది నారాయణ, రాథోడ్ అరవింద్, రాథోడ్ వామన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. భీంపూర్ ఏవో శ్రీనివాస్, ఏఈవో సాయి ప్రసాద్ సమక్షంలో ట్రాక్టర్, బొలెరో వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. కమీషన్‌కు ఆశపడి మహారాష్ట్ర జొన్నలు తెలంగాణలో విక్రయించే వారికి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డులిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేవారిపై ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మందులను అందుబాటులో ఉంచాలి

**-నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్**

నిర్మల్ చైన్‌గేట్, మే 9: రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్ ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలోని డ్రగ్‌స్టోర్‌ను జిల్లా వైద్యాధికారి రాజేందర్ దవాఖాన సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన మందులను ఉమ్మడి జిల్లా మెయిన్ డ్రగ్‌స్టోర్ నుంచి లేదా రాష్ట్రం నుంచి ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్, వైద్యులు పాల్గొన్నారు.



డ్రగ్‌స్టోర్‌ను పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్